క్లుప్తంగా

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మొక్క నాటుతున్న హెచ్‌ఎం, విద్యార్థులు

హసన్‌పర్తి: కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రధానోపాధ్యాయుడు అకుతోట రాంబాబు పిలుపునిచ్చారు. నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే కార్యక్రమాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాయు కాలుష్యం సంక్లిష్ట సమస్యగా తయారైందని వాపోయారు. ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది మరణాల్లో ఒకరు వాయు కాలుష్యం వల్ల మరణిస్తున్నారని వివరించారు. వాయు కాలుష్యం వల్ల ఢిల్లీ నగరంలో జన జీవనం అస్తవ్యస్తంగా మారిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రకృతిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతిఒక్కరూ నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని రక్షిస్తామని విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం.. సామాజిక బాధ్యత

మామునూరు: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, అది సామాజిక బాధ్యత అని, ఈక్రమంలో రక్తదానం చేసేందుకు యువత, విద్యార్థులు ముందుకు రావాలని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్‌యాదవ్ సూచించారు. 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఫార్మసీ అధ్యాపకుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ సహకారంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమల్ యాదవ్ మాట్లాడారు. విద్యార్థులు సేవాభావంతో ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారని చెప్పారు. రెడ్ క్రాస్ సంస్థ వైద్యుల పర్యవేక్షణలో మోటివేటర్ శ్రీనివాస్ బృందం సభ్యులు సుమారు 150 యూనిట్ల రక్తపు యూనిట్లను సేకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విభూదితో అభిషేకం

కాజీపేట : కాజీపేట పట్టణంలోని హరిహర పుత్రుడు అయ్యప్పస్వామికి గురుస్వాముల శరణుఘోషల మధ్య శనివారం విభూదితో అభిషేకం నిర్వహించారు. వనవోలు సాయికృష్ణ వర్మ, ఉడుతల శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి మహార్చన జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. మాలధారులతో సహస్ర నామ పారాయణం, గణపతి సహస్ర నామ పారాయణం, సుబ్రహ్మణ్య అష్టోత్తరం, హారతి, మంత్రపుష్పం పూజలను కనుల పండువగా నిర్వహించారు.

రైతులకు ‘మిచాంగ్’ గుబులు




సంగెం: ఎల్గూర్‌రంగంపేట చెరువు కింద ఇంకా కోయని వరి పంటలు

- పూర్తికాని వరి కోతలు
- కల్లాల్లో ధాన్యంతో అన్నదాత ఆగమాగం

సంగెం : పచ్చని మాగాణిలో సిరులు కురిసింది.. అన్నదాతల ఆశల పంట పండింది.. ఆరుగాలం కష్టపడి పండించిన వరిచేలు కోతకు వచ్చాయి.. కానీ, పండించిన ధాన్యం చేతికి వచ్చేదెలా? అని అన్నదాతలకు ఆందోళన మొదలైంది. మిచాంగ్ తీవ్ర తుపాన్ ప్రభావం కారణంగా మబ్బులు పట్టడంతో రైతులకు మరింత గుబులు పట్టుకుంది. సంగెం మండలంలో వరి కోతలు కొనసాగుతున్నాయి. వాన మబ్బులను చూసి రైతులు వరి ధాన్యం కల్లాల్లో తడవకుండా రాశులు పోసుకుంటున్నారు. సంగెం, కుంటపల్లి, ఎల్గూర్‌రంగంపేట, కాపులకనిపర్తి, వెంకటాపూర్, కాట్రపల్లి, ఆశాలపల్లి, మొండ్రాయి, నల్లబెల్లి, పల్లారుగూడ తదితర చెరువుల కింద సాగు చేసిన వరి కోతకు వచ్చింది. అలాగే కోసిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వరి ధాన్యం ఆరబెట్టడానికి అనువైన స్థలం లేక, మంచు, వాన నుంచి కాపాడుకోవడానికి సరిపోను టార్పాలిన్లు షీట్లు లేక ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ తీవ్రత ఎక్కువై ఆకాల వర్షం కురిస్తే అన్నదాతలకు భారీ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళనతో ఆకాశం వైపు దీనంగా చూస్తు రోదిస్తున్నారు.

ముమ్మరంగా వరి కోతలు



ఖానాపురం : పాకాల ఆయకట్టు పరిధిలో రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. ఆయకట్టు పరిధిలో 29,500 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. రైతులు సన్న రకాలను అధికంగా సాగు చేయడంతో ప్రైవేటు వ్యాపారులు సన్న ధాన్యాన్ని జోరుగా కొనుగోలు చేస్తున్నారు. ప్రారంభ దశలో సన్న ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేయగా ప్రస్తుతం ఆరబెట్టిన తర్వాత ధాన్యాన్ని మద్దతు ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జై శ్రీరాం వంటి రకాలను రూ.3వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు సన్న రకాలను అధికంగా కొనుగోలు చేస్తుండడంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు విక్రయించుకోవడానికి ముందుకు రావడం లేదు. కేవలం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.

‘విజయోత్సవ ర్యాలీ, వేడుకలు నిషేధం’

నర్సంపేట / నర్సంపేట రూరల్ / నెక్కొండ : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు (ఆదివారం) వెలువడనున్నందున ఎలక్షన్ కోడ్‌తో పాటు 144సెక్షన్ అమలులో ఉందని, నర్సంపేట నియోజకవర్గ ప్రజలందరు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, వేడుకలు ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని నర్సంపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బాణాసంచా పేల్చడం, డీజే సౌండ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, తదితర ర్యాలీలు చేయకూడదన్నారు. గెలిచిన పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు, అభిమానులు విజ్ఞత పాటించాలన్నారు. ఓటమి చెందిన వారి పార్టీ అభ్యర్థుల కార్యకర్తలు, అభిమానుల ఇళ్ల ఎదుట ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదన్నారు. నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్ధన్నపేటలో 144 సెక్షన్ అమలు

వర్ధన్నపేట : అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా నేడు(ఆదివారం) వర్ధన్నపేట పట్టణంతో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందని ప్రజలు సహకరించాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. అదే విధంగా ఎలాంటి ర్యాలీలు, డీజేలు, బాణాసంచా పేల్చడం నిషేధమని తెలిపారు. 24 గంటల తదుపరి అనుమతి తీసుకుని సంబరాలు చేసుకోవాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజలంతా తమతో సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఖానాపురంలో..

ఖానాపురం : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై మాధవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ర్యాలీలు, డీజేలు, బాణాసంచా పేల్చడం, నలుగురి కంటే ఎక్కువగా గుమి కూడడం నిషేధించినట్లు తెలిపారు.

సంగెంలో..

సంగెం : మండల పరిధిలో 144 సెక్షన్ అమలుతో ఉన్నట్లు ఎస్సై ఎం. భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, డీజే సౌండ్స్, బాణాసంచా కాల్చడం వంటి చేయవద్దన్నారు.

దుగ్గొండి మండలంలో..

దుగ్గొండి : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నేడు(ఆదివారం) మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అములులో ఉంటుందని ఎస్సై పరమేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలకు, టపాసులు పేల్చడానికి, నలుగురికంటే ఎక్కువగా గుడికూడేందుకు సైతం అనుమతి నిషేధించబడిందన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత 24 గంటల అనంతరం అనుమతి తీసుకుని ర్యాలీలు నిర్వహించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్ప దివ్య పడిపూజ



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు



అయ్యప్పస్వామి ఆలయంలో 18మెట్లకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో శనివారం పుష్పాభిషేకం, దివ్య పడిపూజ, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్య పడి పూజ, మహా అన్నదాతలుగా మాలె రవి,సరిత వ్యవహరించగా ఆలయ నిత్య అర్చకులు దేవేష్‌మిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలే సుజాతకనకయ్య, గన్నేపల్లి కృష్ణమూర్తి, వేంశెట్టి శ్రీనివాస్, దొండేటి శ్రీనివాస్‌రావుసుజాత, పొన్నం గణేష్‌మౌనిక, నల్ల నరేందర్‌విజయలక్ష్మి, నల్ల సుధాకర్‌రెడ్డిభారతి, వడ్డేపల్లి సారంగపాణిసీరజ, సంతోష్‌హరిణి, రాజేష్, సురేష్, దార ప్రశాంత్‌సుమలత, మాదారపు చంద్రశేఖరం, దొర్థ రవీందర్, శ్రీరాంతుశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీపై బెట్టింగ్ !

దుగ్గొండి : నర్సంపేట అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో గెలుపు ఎవరికి వరించునోనని స్థానికంగా బెట్టింగ్ జరుగుతోంది. ఈమేరకు దుగ్గొండి మండలంలోని పలు గ్రామాల్లో ఆయా పార్టీల మెజార్టీపై కార్యకర్తలు జోరుగా బెట్టింగులు నిర్వహించినట్లు తెలిసింది. మండల పరిధిలో బీఆర్‌ఎస్‌కే మెజార్టీ వస్తుందని కొందరు.. లేదు కాంగ్రెస్‌కే మెజార్టీ అంటూ ఇంకొందరు జట్లుగా విడిపోయి వివిధ గ్రామాలలో జోరుగా బెట్టింగులకు దిగినట్లు తెలుస్తోంది.

బిట్స్‌లో ‘నేషనల్ పొల్యూషన్ డే’

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో నేషనల్ పొల్యూషన్ డే కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్బన పదార్థాలు ఎక్కువ వాడటం వల్ల వాతావరణంపై ప్రభావం చూపుతుందని సూచించారు. వివిధ విభాగాధిపతులు మనీష్, రవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కళాశాలలో నేషనల్ పాపులేషన్ డే పై అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరించారు.

‘ఎర్రబెల్లి’ గెలుపొందాలని యాదాద్రిలో పూజలు

రాయపర్తి : బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపొందాలని కోరుతూ యాదాద్రిలో పూజలు చేసినట్లు మండల వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఓటమెరుగని నాయకుడిగా పేరున్న దయాకర్‌రావు మళ్లీ గెలుపొంది పాలకుర్తిని మరింత అభివృద్ధి చేయాలని యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామికి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అందరి మన్ననలను పొందుతున్న దయాకర్‌రావు మరోసారి గెలిచి నూతనంగా ఏర్పడే ప్రభుత్వంలో మళ్లీ మంత్రిగా రావాలని కోరుకున్నానని చెప్పారు.

‘గండ్ర’ గెలుపొందాలని..

కాయంపేట : నేడు వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాలని వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి శనివారం శ్రీబుగులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబుగులోని వేంకటేశ్వర స్వామి కృపా కటాక్షంతో భారీ మెజార్టీతో ఆయన గెలవాలని వైస్ ఎంపీపీ ఆకాంక్షించారు.

‘కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం’



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పరకాల నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని స్వర్ణ గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో ప్రజల నాడీని పరిశీలిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఊహించని వ్యతిరేకత కనిపించిందన్నారు. ఎంతో కాలంగా బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు ఎదురుచూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పరకాలలో కాంగ్రెస్ విజయం సాధించడం తథ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన గెలుపు కోసం కృషి చేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దొమ్మాటి సాంబయ్య, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ, చందర్, శ్రీనివాస్, రాంమూర్తి పాల్గొన్నారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



కాజీపేట: మాట్లాడుతున్న కవిత

కాజీపేట అర్బన్: ఆపదలో ఉన్న మహిళలు సఖి వన్ స్టాప్ సెంటర్ అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పేర్వారం హైమావతి తెలిపారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సఖి వన్‌స్టాప్ సెంటర్ 24 గంటలు పనిచేస్తోందని, అవసరమైన మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే సేవలందిస్తారని చెప్పారు. శారీరక, మానసిక, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళల సమస్యల పరిష్కారంతో పాటు తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’

కాజీపేట: వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తెలిపారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లతే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సఖి కేంద్రానికి సమాచారం అందించి తక్షణ రక్షణ కల్పిస్తామని చెప్పారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లకు సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో సఖి సేవలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రమేశ్

పర్వతగిరి : విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులైన తర్వాత తమకు తోచిన విధంగా ఇతరులకు సహాయ సహకారాలు అందించాలని ఎస్టీయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని రమేశ్ సూచించారు. ఈ మేరకు మండలంలోని కల్లెడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఐదేళ్లుగా తనకు తోచిన విధంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు నిరంజన్, రాజుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



గీసుకొండ: సాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు



రాయపర్తి: బియ్యం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన హోంగార్డు వడ్డెబోయిన రాజ్‌కుమార్ ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబానికి శనివారం గ్రామ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన ఎస్సై మండల ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ కెత్తె వీరేందర్, దిడ్డి భాస్కర్, సముద్రాల గ్రావణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి బియ్యం అందజేత

రాయపర్తి : మండలకేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు వలబోజు రవీందర్‌చారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా శనివారం సీపీఐ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాస్, ఇస్లావత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌పై పోస్ట్‌మార్టం



- పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన
- క్రాస్ ఓటింగ్‌పై ఓ ప్రధాన పార్టీ ఆశలు

హసన్‌పర్తి: తెలంగాణ శాసనసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులు పోస్టుమార్టం నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో 278 బూత్‌లు ఉన్నాయి. మొత్తం 2,69,192 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషులు 1,32,736, మహిళలు 1,36,441 మంది, ఇతరులు ఉన్నారు.

బూత్‌ల వారీగా..

పోలైన ఓట్లలో ఆయా పార్టీలు బూత్‌ల పార్టీగా పోస్టుమార్టం నిర్వహించాయి. ఆయా బూత్‌ల వారీగా తమకు ఇన్ని ఓట్లు వస్తాయని అంచనా వేశాయి. ఆయా కేంద్రాల్లో పడిన ఓట్లల్లో తమ పార్టీకి ఇన్ని ఓట్లు పోలవుతాయని అభ్యర్థులు లెక్కించుకుంటున్నారు. తప్పకుండా గెలుస్తామని ఇప్పటికే సంబరాలకు సిద్ధమవుతున్నారు.

క్రాస్ ఓటింగ్‌పై ఆశలు

క్రాస్ ఓటింగ్‌పై ఓ ప్రధాన పార్టీ ఆశలు పెట్టుకుంది. ఈసారి నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు తమను ఆదరించారని ఆ పార్టీ చెబుతోంది. క్రాస్‌ఓటింగ్‌తో తాము గెలుస్తామనే విశ్వాసంతో ఉంది. ఓటర్లను మచ్చిక చేసుకోవడంలో వెనుకబడినప్పటికీ క్రాస్ ఓటింగ్‌పై నమ్మకంతో ఉంది.

అభ్యర్థుల్లో ఆందోళన

క్రాస్ ఓటింగ్‌పై ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఓటర్లను మచ్చిక చేసుకున్నప్పటికీ ఓటు పడిందో లేదోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు అభ్యర్థులు ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆయా మండలాలు, డివిజన్ల నాయకులతో ప్రధాన పార్టీల అభ్యర్థులు సమావేశాలు నిర్వహించి పోలింగ్‌పై నివేదిక కోరినట్లు సమాచారం. కాగా, ఈవీఎంల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవిత ఆదివారం తేలనుంది.

పుచ్చసాగు.. లాభాలు బాగు



సాగు చేసిన పుచ్చ పంట



పుచ్చతోట సాగుపై రైతుకు సలహాలు ఇస్తున్న ఉద్యానశాఖ అధికారి రమేశ్

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఉద్యానశాఖ అధికారి రమేశ్

చెన్నారావుపేట : పుచ్చకాయలు కనిపిస్తే చాలు తినడానికి నోటిలో నీళ్లు ఊరుతాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరు ఇష్టపడతారు. ప్రతి శుభకార్యంలోనూ తప్పనిసరిగా పుచ్చకాయ ముక్కలు ఉండాల్సిందే. కాగా తీగ జాతి పంటల్లో పుచ్చసాగు ఒకటి. వేసవితో పాటు ప్రతి శుభకార్యంలో ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా ఆరోగ్యాన్నిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుటకు పుచ్చ సాగుకు అనువైంది. ఉద్యాన శాఖ అధికారి రమేశ్ అందిస్తున్న పలు సూచనలు..

వాతావరణం..

పుచ్చ పండ్లు మంచిగా ఉండాలంటే ఎక్కువ ఉష్ణోగ్రత కలిగిన పొడి వాతావరణం అవసరం. వాతావరణంలో తేమ అధికంగా ఉన్న ప్రాంతంలో తెగుళ్లు ఎక్కువగా ఆశించే అవకాశముంది.

నేలలు..

మురుగు నీటి వసతి ఉన్న ఇసుక నేలల నుంచి తేలకపాటి బంక మన్ను కలిగిన నేలల వరకు ఈ పంటను సాగు చేయవచ్చు. ఉదజని సూచిక 6.0 నుంచి 6.7 ఉన్న నేలలు సాగుకు అనువైనవి.

పుచ్చ రకాలు..

పుచ్చలో అసాహియమాటా, సుగర్‌బేబి, అర్కజ్యోతి, అర్కమానిక్ లాంటి రకాలు ఉన్నప్పటికి నాందారి-295, వరాస్, అపూర్వ లాంటి రకాలు ఎక్కువగా రైతులు సాగుచేస్తున్నారు.

నారింజ రంగు కండ కలిగిన రకాలు..

పూసా శర్బతి, పూసా మధురసే, పంజాబ్ సున్హేరి రకాలు నారింజ రంగు కండ కలిగి కాయపైన సున్నాటి గీతలు ఉంటాయి. 600-800 గ్రాముల బరువు తూగుతాయి. హెక్టారుకు 150-160 క్వింటాళ్ల దిగుబడినిస్తాయి. హరి, మధు పండ్లు గుండ్రము లేదా చదునుగా ఉండి పుచ్చ రంగు కలిగిన తియ్యటి కండతో ఉంటాయి. కాయలు కిలో బరువుంటాయి. ఎక్కువ కాలం నిల్వ ఉండవు. ఆలస్యంగా కోతకు వచ్చే రకం. ఇవి కాక ప్రైవేట్ విత్తన సంస్థలు విడుదల చేసిన నాందారి-7455, సన్, కాంచన్, మొదలగు రకాలను రైతులు సాగు చేసి దూర ప్రాంతాలకు రవాణా చేసి ఆదాయం పొందుతున్నారు.

విత్తనాలు నాటు పద్ధతి

తోట పంటగా సాగు చేసినప్పుడు 3-3.5 మీటర్ల ఎడం, 60 సెం.మీ వెడల్పు గల నీటి కాల్వలను తయారు చేసుకోవాలి. ఈ కాల్వలకు ఇరువైపులా విత్తనాలను 30-50 సెంటీ మీటర్ల ఎడంలో విత్తనాలు నాటుకోవాలి. ఈ పద్ధతి ద్వారా ఎకరానికి 750 గ్రాముల విత్తనం సరిపోతుంది.

ఎరువులు..

బాగా ఫులిసిన పశువుల ఎరువు హెక్టారుకు 10-12 టన్నుల వరకు వేసుకోవాలి. ఇది కాక 80-100 కిలోల భాస్వరం, 40-60 పొటాష్, 60 కిలోల నత్రజని నిచ్చు రసాయనిక ఎరువులు వేయాలి. నగం నత్రజని నాటేటప్పుడు మిగితా నగం (30 కిలోలు) నాటిన 25 రోజుల తర్వాత వేసుకోవాలి.

నీరుకట్టుట..

తోట పంటకు మొక్కల ప్రథమ దశలో, మళ్లీ కాయ ఎదిగేటప్పుడు నీటి అవసరం ఎక్కువ. కాయలు పక్వానికి వచ్చినప్పుడు ఎక్కువ నీరు కట్టడం వల్ల కాయలు పగిలిపోవటమే కాక నాణ్యత తగ్గుతుంది. డ్రిప్ పద్ధతి ఏర్పాటు చేసి సాగు చేస్తే నీరు, విద్యుత్ ఆదాతో పాటు అత్యంత నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. ఎరువులు డ్రిప్ పద్ధతిలో పంపడం వల్ల ఎరువుల వినియోగం పెరిగి అధిక దిగుబడి పొందవచ్చు.

అంతరకృషి..

కలుపు మొక్కలు ఎప్పటికప్పుడు తీసివేయాలి. మొక్కలు బలంగా పెరగటానికి 2-3 తడుల తర్వాత ఒకటి రెండు సార్లు మట్టిని తేలికగా గుల్ల చేయాలి.

కోత..

పుచ్చపండు పక్వానికి వచ్చినపుడు కాయ మొదట్లో సన్న మీసం లాంటి తీగ ఎండిపోతుంది. కాయ నేలకు తగిలే భాగం పసుపు రంగుకు తిరుగుతుంది. కాయను చేత్తో తడితే కంచు శబ్దం వస్తుంది. దూరపు మార్కెట్లకు పండు కింది భాగం తెలుపు నుంచి పసుపుకు మారగానే కోసుకోవాలి.

దిగుబడి: పుచ్చపండు హెక్టారుకు 20-25 టన్నుల దిగుబడి వస్తుంది.

రేపటి నుంచి ‘అజర’లో ఉచిత వైద్యసేవలు



ఎంజీఎం: ములుగురోడ్డులోని అజర ఆస్పత్రి నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హాస్పిటల్‌లో ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4నుంచి 17వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉచిత కన్సల్టేషన్, రక్త, మూత్ర, గుండె పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు, డైటీషన్ కన్సల్టేషన్, పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే, ఆస్పత్రిలో ఉన్న రోగులకు పలు రకాల శస్త్రచికిత్సలపై ప్రత్యేక తగ్గింపు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య సేవల అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.